# కర్టెన్ లెక్చర్స్ (5)

"ఏమి శిక్షకావాలో, కోరు కొనవే ప్రేయసీ...." ప్రేయసెవరిక్కడ? ప్రేయసిలేదు, రాక్షసీలేదూ- మెడవంచి తాళి కట్టించుగున్నాక దుశ్శాసనుడైతే మాత్రం తప్పేదుంది గనుకనా... "మురిపెముగా ముచ్చటగా ముద్దు ముద్దుగా" యికవేరే శిక్షదేనికి? పెళ్ళాం ముండ ఎట్లాగూ ప్రేయసికాలేదు. మనసినిమాల్లో వున్నట్లు మన సొసైటీలో ప్రేయసుల్లేరు. కవులూ రచయితలూ పిచ్చివాళ్ళు పొళ్ళను కుంటే అనుకోనివ్వండి! మన సొమ్మేం పోయింది? కష్టాలు సుఖాలు పడుగు పేకల్లా

కలగలిపినేసిన జీవితాన్ని కలనేతచీరలా చుట్టుకుతిరగడంతప్ప మురిపాలు. ముద్దులూ. ముచ్చట్లూ ఈ రోజుల్లో మనకెక్కడ కుదురుతాయి?

"ఎవరివో- ఎచటనుంటివో సఖి

నీలమేఘ మాలికవో మెరిసిపడే చంచలవో

చెలిమిచూసి చెంతరాక మురిపించే మిల మిలవో...." బాగుందండి. పాట- ఎవరివో ఏమిటి? శుభలేఖ తెచ్చి యిమ్మంటారా. మళ్ళీ చూసుకుందువుగాని పేర్లు. ఎచటనుంటివో అంటారా. ఇంకెక్కడుంటాను. తమ పాదచరణసన్నిధిని. మహారాజులాగ అద్దెయిచ్చి కరెంటుకి కట్టి వుంటున్నాము. నీలమేఘమాలికవో మెరిసిపడే చంచలవో అంటారా- నల్లగావుండే వుంటాం ఆమాత్రానికి నీలమేఘమాలిక అని వెక్కిరించ నక్కర్లేదులెండి. మెరిసిపడే చంచలవో...." అనడానికి జరీచీర కట్టుకుంటే పట్టురవిక తొడుక్కుంటే కాస్త మిలమిల లాడేనేమో-రోడ్డుమీద పొయ్యే దాన్ని ఎవత్తి నేనా చూసి మెరిసిపడే చంచలవో" అనండి పళ్ళూడ గొడతారు.

"చెలిమి చూసి చెంతరాక" అంటే పోట్లాడుకున్నా కొట్లాడుకున్నా. కాసేపు వాళ్ళింట్లో వీళ్ళింట్లో కూర్చుని ఏడిపించినా చెంతరాక తప్పుతుందా? రాకపోతే ఈ చెట్టుకిన్ని పూలూ కాయలూ పళ్ళూ ఎల్లా కాసేయి? ఆస్పత్రులు. రోగాళ్ళు. మందులూ అన్నీ ఈ "చెలిమి" వల్లనే కదా- మురిపించవంటే- అస్తమానూ వచ్చి ఏ ఆడదీ మెళ్ళో చేతులువేసి ఒళ్ళో కూర్చోదు- "ఇది నా చెలి ఇది నా సఖి. నా మనోహరీ అని పాడుకోడానికి సినిమాలో అయితే దబ్బిస్తారు. కాబట్టి వాళ్ళలా ఒళ్ళోవచ్చి కూర్చుంటారు' ఎంచక్కా. తప్పు! అలాటి కోరికలు మనసులో పెట్టుకోకండి. అంత లైటు ఒక్కమాటు

మీ మీద పడ్తే మీరు తట్టుకోగలరా- అయినా మనింట్లొ అలాటి కుర్చీ లేవీ-

నీ జ్ఞాపకాల సూట్ కేస్ మూత తెరిస్తేఅందులోంచి. బయట పడేవి పాత సినిమా పాటలా అని పెదవి విరవకండి. నా సూట్ కేస్‌లో జీవితపు రూల్సుసందున కొత్త కరెన్సీ నోట్లలాటి జ్ఞాపకాలూ వున్నాయి. పాత సినిమా పాటలూ వున్నాయి.

"కలువ కనుల చల్లని సిరి

ఉల్లములో ప్రేమ లహరి" ఆ మాటన్నారు. బాగుంది. కంట్లో చల్లనిసిరి లేకపోతే ఉల్లములో ప్రేమలహరి ఎక్కడ్నుంచి కొట్టుకొస్తుంది? గుండెల్లో ప్రేమ పొంగేదీ లేనిదీ కళ్ళల్లోచూస్తే తెలిసిపోతుంది. ఆయనెవరు. రాజమండ్రి ప్లీడరు కామోసు.

"కళ్ళల్లొ ముద్దెట్టుతూ తెల్లార నీనంటకీ

తెల్లారి పోతుంటెతా నెల్లాగో అయిపోతది?" అని రాసేరు. రాశారా- ఎన్ని రాత్రులు ఎన్ని పగళ్ళు- ఈ జీవితం యిలా వెళ్లిపోవడమేనా? మీరూ నేనూ బండి చక్రాల్లా- గతుకుల బాటపై ఒంటెద్దు ప్రయాణంలా యిలా సాగిపోవలసిందేనా? అవును! ప్రేమలహరి పుట్టుకురావాలంటే కళ్ళల్లోనేకాదు. యిళ్ళల్లోకూడా "సిరి" వుండాలి. ఆ మాట నేను నమ్ముతాను.

"ఈ విరహములో ఈ నిరాశలో

నీ కోసమె నే జీవించునది."

విరహమంటే నమ్మను కాని నిరాశంటే నమ్ముతాను, నేను మా వూరెళ్తే విరహమేమిటి జీతవంతా జల్సాగా ఖర్చుచేసి పూలరంగ

డిలా తిరిగేస్తారు. స్నేహితులు హోటళ్ళు సినిమాలు క్లబ్బులు వుండగా విరహంలోనూ నిరాశలోను బ్రతుకుతానంటే నమ్మడమెలాగ? తప్పితే - వుంకో రకం నిరాశ వుంటే వుంటుంది. ఎవత్తెనో మెరిసిపడే తారకను కావాలనుకుంటే నిరాశ తప్పదు. లక్షలు కావాలనుకున్నా భోగాలు సుఖాలు కావాలనుకున్నా నిరాశ తప్పదు. మన పనిపిల్ల "లచ్చి"కి బొంగరంలా తిరిగేదానికి నిరాశ ఎక్కడ్నుంచి. రమ్మంటే ఒస్తుందా?

"నీవైపుగాలీ నావైపు వీస్తే
ఉర్రూతలూగెద సై సై సై అన్నట్లుందది!

లచ్చికి సుఖాలు తెలియవు. అంచేత కష్టాలు కూడా తెలియవు. వయసు తెలియనిస్తుందా?

"అహ నా పెళ్ళంట - ఓహో నా పెళ్ళంట అని మాయా శశిరేఖలా గెంతుతుందది.

"బాలా కుమారినంట చాలా సుకుమారినంట పెళ్ళికొడుకు నన్ను చూసి మురిసి మూర్ఛ పోవునంట"

అంటూ పాటవళ్ళు తొక్కుతుంది. "కష్టాల గీతలు మొహం మీద పడేది యవ్వనం గడిచాకనే - అప్పుడు

"ఇన్నాళ్ళ ప్రేమ కన్నీరుగా

కన్నీరు మారేను మున్నీరుగా-" అనిపించవచ్చు. యవ్వనం గడిచిపోయాక యవ్వనాన్ని నటించే సినిమా తారల్ని చూస్తే. చూస్తే కుర్రాళ్ళకు వాళ్ళు బఫూన్లలా కనపడ్డంలో తప్పులేదు. "ది పాసింగ్ అఫ్‌యూత్ దాన్ని అంగీకరించకుండా "విధి రాకాసి కత్తులు దూసి. నను వేపునే ప్రేయసీ" అని కాలంమీద విరుచుకుపడితే ఏం లాభం! లాభాలకోసమే యవ్వనం పోయినా వున్నట్లు యాక్టు చెయ్యడం!

కట్నాలు బేరవాడుకునే మనవాళ్ళు కుర్రాళ్ళకి వలపు రుచి తెలుసుకునే ఛాన్స్ యిప్పిస్తారా? అందులో తెలుగు సొసైటీ....కుళ్ళిపోతున్న ఈ పెళ్ళిళ్ళ వ్యవస్థ-

"నీవేనా తలచినది

నీవేనా నను పిలిచినది

నీవేనా నా మదిలో నిలచి హృదయం

కలవర పరచినది"

అని పాడుకోనిస్తారు?

రూపాయలు పోతే ప్రాణాలు పోతాయి.

అయితే పెళ్ళాం మూడోసారో నాలుగోసారో నెల తప్పినప్పుడు నీవేనా నా మదిలో నిలిచి హృదయము కలవపరచినది? అని పుట్టబోయే పాపగురించి అనుకుంటే అనుకోవచ్చు. అందుకే ఫామిలీ ప్లానింగు న్యాయసూత్రరీత్యా

"మగవారికి దూరముగా

మగువలెపుడు మెలగాలని

తెలుసుకొనవె చెల్లీ

అలా - నడుచుకొనవె చెల్లీ -"

అని చెప్పాలిసొస్తోంది.

పెళ్ళి ఊరేగింపు చూసినప్పుడు సంతోషంగానే వుంటుంది. పిల్లాడూ పిల్లా బాగున్నారా లేదా. అని చూస్తాం. కాని ఏ. జీ. టీ.లోవో,

త్రీ అప్. ఫోర్ దవున్లోనో ఆ రాత్రే పెండ్లాడి పిల్లను తనతో కూడా లేవతీసుకుపోయే అర్థరంటు ఐ. ఏ. ఎస్ పెళ్ళికొడుకుల్ని చూస్తే....

"వధువూ వరుడు పల్లకిలోన

పరదేశ మేగెదరు పాట జ్ఞాపకమొస్తుంది. పిల్ల పెద్దవాళ్ళ కళ్ళు తుడుచుకుంటూంటే ఎందుకో బాధగానే వుంటుంది.

కరకులు మావాయె

కన్య మా దాయె

లబ లబలు మీవాయె

రమణి మా దాయె- అన్న ఓల్డు సాంగ్ ఒకాటి గుర్తుకొస్తుంది, అందుకే సినిమావాడు చెప్పాడు.

"పరదేశి యోంసేన

అఖియా మిలానా

పరదేశి యోంకా

ఏక్ దిన్ జానా"

పరదేశిని ప్రేమించకూడదు. పరదేశిని పెళ్ళాడకూడదు. రెండిటిలో ఏది చేసినా దుఃఖ తథ్యం. దుప్పటి దులుపుకు లేచిపోతాడు,

మాపనిపిల్ల లచ్చి - దానిమొగుడు "హొయ్ జాగు" పనికోసం పారెల్లాడు గుంటనలా ఒగ్గేసి

"ఆడనీవూ యీాడనేను

చూసుకుంటా కూసుండే

ఎన్నాళ్ళు తాళగలను చందమామా

ఎన్నాళ్ళు దాచగలను చందమామా

అవును పరవళ్ళు తొక్కే వయసులో ఉరుకులు పెట్టే మనసులోని బంగారు కోర్కెల్ని ఎన్నాళ్ళని దాచగలదు?

"దాచుకోకుండేను దోచుకుంటారు."

ఇంతకీ విరహం మంచిదా చెడ్డదా అని కాదు. జీవితాల్లోంచి మంచి మంచి సంగతులన్నీ ఇగుర్చుకుపోయి చివరకు సినిమాల్లోనూ పుస్తకాల్లోనూ వాటిని గుర్తుపట్టుకునే స్థితికొచ్చాము.

ఇంతకీ మీరెవరు? నేనెవరు? మనం ఎల్లాకలిశాము? ఎంతదాకా ఈ ప్రయాణం-వీళ్ళంతా ఎవరు మన చుట్టూ? అని నాకనిపిస్తోవుంటుంది.

పచ్చని చెట్టుక్రింద నిలబడితే — ఈ ఆకులన్నీ ఒక్కలా ఎందుకుండవు: ఇవన్నీ ఎందుకు రాలిపోతాయి. ఈ రంగులన్నీ ఎందు కంత తేడాగా వుంటాయి? ఏమో। ఆకులు రాలుతూ అవిచేసే చప్పుళ్ళు, ఏవిటో రహస్యాలు చెబుతున్నట్లుగా నా కనిపిస్తో వుంటుంది. మీరింట్లోలేనప్పుడు మధ్యాహ్నం కిటికీదగ్గర కూర్చుని ఆకాశంకేసి చెట్లకేసి పిట్టలకేసి చూస్తూగడి పేస్తాను. నాలోనేను మాట్లాడుకుంటాను నవ్వుకుంటాను.

వాడినపూలే వికసించెనే - చెర

వీడిన హృదయాలు పులకించెనే

తీయని కలలే ఫలియించెనే- ఎల

కోయిల తనగొంతు సవరించెనే

నా జ్ఞాపకాల సూట్ కేస్ తెరచి అందులోని పాతసినిమా పాటల జ్ఞాపకాలతో అల్లిన రంగుల రుమాలును మీ ముందువుంచితే మీరు సిల్లీ గర్ల్ అని నవ్వుతున్నారు కదూ?

సే మోల్డు ఆన్సర్।

ఐ డోంట్ కేర్-